# ఉపాధిహామీ పనులు కష్టమే

- బయోమెట్రిక్ అటెండెన్స్‌కు సర్వర్ ప్రాబ్లమ్
- సతమతమవుతున్న ఉపాధిహామీ సిబ్బంది



ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

**పుట్లూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

కూలీల వలసలను నివారించి వారికి గ్రామాల్లోనే పనులు కల్పించేలా అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ప్రస్తుతం పథకంలో కొన్ని మార్పులు చోటు చేసుకోవడంతో ఉపాధి హామీ శ్రామికులకు పనులు కల్పించడం కష్టతరం అవుతోంది. మండల వ్యాప్తంగా 9885 జాబ్ కార్డులు ఉండగా 16006 మంది కూలీలు ఉన్నారు. గత సంవత్సరం 642 కుటుంబాలకు 100 రోజులు పనులు కల్పించడం జరిగింది. ప్రస్తుతం ఉపాధిహామీ శ్రామికులకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి కావడం, గ్రూపుల వారీగా కాకుండా ఒక్కొక్క వ్యక్తికి ఒకసారి ఫోటో తీసి ఫోటో అప్లోడ్ చేసే సమయంలో సర్వర్ సమస్య సిబ్బందికి తలనొప్పిగా తయారయ్యింది. గతంలో ఎన్ఎంఎంఎస్ ప్రక్రియ ద్వారా గ్రూప్ వారీగా ఫోటో అప్లోడ్ చేసేవారు. కాగా ప్రస్తుతం ఈకేవైసి పూర్తి అయిన వారికి ఒక్కొక్కరికి ఫోటో హాజరు పని ప్రదేశంలో చేస్తున్నా సాంకేతిక సమస్య కారణాలతో హాజరు నమోదు కాలేక పోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు జిల్లా ఉన్నతాధికారులు ఉపాధిపనులు కల్పించాలని ఆదేశాలు ఇస్తుండడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అని సిబ్బంది మదనపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పరిస్థితి అర్థం చేసుకొని గతంలో మాదిరి హాజరు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాది శ్రామికులు, సిబ్బంది కోరుతున్నారు.

# కన్నులపండువగా స్వామివారి కళ్యాణోత్సవం



స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

**పెద్దపప్పూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన పవిత్రపుణ్యక్షేత్రం అశ్వత్థంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత అశ్వత్థనారాయణస్వామి, పార్వతీ సమేత శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవాన్ని వేదపండితులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, అనీల్‌కుమార్‌శర్మలు శాస్త్రోక్తంగా కన్నులపండువగా నిర్వహించారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారి కళ్యాణోత్సవాన్ని యాడికి చెందిన గుండా నారాయణస్వామి కుటుంబసభ్యులు జరిపించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవను మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణోత్సవాన్ని వీక్షించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుబ్రమణ్యం, ఆలయ చైర్మన్ బి.శివశంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, చితంబరి, ఆలయ సిబ్బంది గురప్ప, అరుణ్, నారాయణ, రాఘవ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# గజవాహనంపై రంగనాథుని గ్రామోత్సవం

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**



గజవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రి మండలం ఆలూరులో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గజవాహనంపై రంగనాథస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మలు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి రాత్రి గజవాహనంపై ఆలూరు గ్రామవీధుల్లో మేళతాళాల నడుమ అంగరంగవైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగనాయకులు, ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కాశీ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థి అనారోగ్యంతో మృతి



మృతి చెందిన భూమిక

**నల్లచెరువు ఏప్రిల్1 ప్రభాత వార్త**

పరిధిలోని మండలం ఏపీ మోడల్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న భూమిక అనే విద్యార్థి అనారోగ్యంతో ఆస్పత్రిలో కన్ను మూసింది. విద్యార్థి సొంత గ్రామం నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డి పల్లి గ్రామం అరుణ విశ్వనాథ్ దంపతుల కుమార్తె విద్యార్థిని చదువులో బాగా రాణిచ్చేదని నా బిడ్డ కలలు కన్నీరు గానే మిగిలాయని తల్లిదండ్రులు తల్లడిల్లి పోయారు. 9వ తరగతి విద్యార్థి భూమిక చనిపోయిన విషయాన్ని గ్రామస్తులుని,తోటి మిత్రులకు కంటి తడి పెట్టించింది.

# ఘనంగా చౌడేశ్వరిదేవి కుంభగూడు ఉత్సవాలు



**అమడగూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

అమడుగూరులో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కుంభగూడు ఉత్సవాన్ని చీకురేవులపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ, నరసింహప్ప కుటుంబ సభ్యులతో పాటు తొగటవీర సంఘం, గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ఉగాది పండుగ పర్వదినంగా బయలుదేరి కుంభగూడు దినాన్ని పురస్కరించుకొని అమ్మవారు గుడికి చేరుకున్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో అమ్మవారికి మేకపోతు, దున్నపోతులు బలి ఇస్తూ కుంభగూడు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కొన్ని వందల సంవత్సరాల నుండి అమలవుతున్న ఈ కార్యక్రమానికి మండల ప్రజలు ఇతర రాష్ట్రాల ప్రజలు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఇరువర్గాలపై కేసు నమోదు

**పుట్లూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

పుట్లూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన నడిమింటి చిన్న బాలన్న కుటుంబసభ్యులు నలుగురు, నడిమింటి వంశీకృష్ణ కుటుంబ సభ్యులు నలుగురు ఇంటి వద్ద ఉన్న స్థలం విషయంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చి పెద్దమనుషులు సమక్షంలో మాట్లాడుకుంటామని ఎంపిడిఒ కార్యాలయం వద్దకు వెళ్లి మాటమాట పెరిగి గొడవ పడుతుండగా విషయం తెలుసుకుని అక్కడికి చేరుకుని ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జె.సి



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జెసి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని నందలపాడు, పీర్లమాన్యంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయా ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 3 వేల రూపాయలు ఉన్న పెన్షన్ 4 వేల రూపాయలకు పెంచుతూ పంపిణీ చేస్తోందన్నారు. ఆ మొత్తాలతో వృద్ధులు, వితంతువులు వికలాంగులు మందులు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు విజయభాస్కర్, జింక లక్ష్మీదేవి, పావురాల శీనయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జాస్ స్టీల్ ప్లాంట్ వద్ద ఉద్రిక్తత

- పోలీసు బందోబస్తు ఏర్పాటు



స్టీల్ ప్లాంట్ వద్ద బందోబస్తు వున్న పోలీసులు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలంలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. టిడిపి నాయకులు, హుసేనాపురం మాజీ సర్పంచు కాకర్ల రంగనాథ్‌కు స్టీల్ ప్లాంట్‌లో ఎక్కువ కాంట్రాక్టులు ఉన్నాయని వాటిని తొలగించి మిగిలిన నాయకులకు కాంట్రాక్టులు ఇవ్వాలని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి వర్గం స్టీల్ ప్లాంట్ వద్దకు హుసేనాపురం, జంబులపాడు, చల్లవారిపల్లి, వీరాపురం, వంగనూరు, బొందలదిన్నె, బోడాయిపల్లి, తదితర గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వర్గం ఇచ్చిన పిలుపుమేరకు జాగ్రత్త పడిన స్టీల్ ప్లాంట్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చింది. రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్టీల్ ప్లాంట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్లాంట్ యాజమాన్యంతో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి వర్గం తమ డిమాండ్లను వివరించడంతో వారు 15 రోజుల పాటు గడువు కోరారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ వద్దకు టిడిపి నాయకులు, కార్యకర్తలు రాకపోవడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి జయంతి ఉత్సవాలు



అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

**యాడికి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు, యాడికి తదితర గ్రామాల్లో అయ్యప్పస్వామి భక్తులు స్వామివారి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి జీవిత చరిత్ర గురించి అర్చకులు భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి మాలదారణ విశిష్టతను గురించి, మాలను ధరిస్తే కలుగు వివిధ ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తమండలి సభ్యులు, పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల కృషి అభినందనీయం

ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి



సర్పంచులను సన్మానిస్తున్న మండల అధికారులు

**నల్లచెరువు ఏప్రిల్ 1 ప్రభాత వార్త**

మండల కేంద్రంలోని ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచుల పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా 13, పంచాయతీల సర్పంచులకు సన్మాన కార్యక్రమం ను నిర్వహించారు పూలమాలలు, శాలువాలను వేసి ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఏప్రిల్ 2 తారీఖుతో సర్పంచుల పదవీకాలం ముగియ నుండటంతో బుధవారం వారికి సన్మానం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సర్పంచుల సేవలను ఆయన కొనియాడారు. గ్రామాల అభివృద్ధి పురోగతిలో సర్పంచుల పాత్ర ఎంతో ఉందని ఆయా గ్రామాల సర్పంచులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సర్పంచులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్ నాయక్, ఏఓ అశోక్ రెడ్డి , ఈ ఓ ఆర్ డి బాబురావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మ, తలమర్ల వండ్లపల్లి పంచాయతీ సర్పంచ్, హర్షవర్ధన్ నాయుడు, ఎం అగ్రహారం సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, పంతులు చెరువు స్వర్ణలత, తవల మరి సర్పంచ్ అంజనమ్మ, బాలేపల్లి తండా సర్పంచ్ సోనాలమ్మ, ఒరు వాయి సర్పంచ్ గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



పెన్షన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**నంబులపూలకుంట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

ఎన్‌పి కుంట మండలం వంకమద్ది గ్రామం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి కూటమి కుటుంబ సభ్యులు మండల కన్వీనర్ శ్రీరాములు నాయుడు ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములనాయుడు, వంకమద్ది రవీంద్ర, పి.నరసింహులు, బూత్ కన్వీనర్ సూర్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు భద్రయ్య నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పాలనంత... దోచుకోవడం..దాచుకోవడమే...

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్...



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి ఏప్రిల్ 1 (ప్రభాతవార్త)**

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనంత దోచుకోవడం దాచుకోవడ మేని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని 31 వార్డుల్లో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ జగన్ మానసిక స్థితి చూసి ప్రజలే భయపడుతున్నారని, మానసిక స్థితి సరిగా లేని వారు రాజకీయాల్లో పోటీ చేయడానికి అనర్హులని,జగన్ మానసిక పరిస్థితిపై ప్రజలే కోర్టులో పిల్ వేసే పరిస్థితి వచ్చిన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారు. కదిరి నియోజవర్గ సరిహద్దులు తెలియని వారు కూడా స్థాయి గురించి మాట్లాడుతున్నారని, రాజకీయాల్లో స్థాయిని నిర్ణయించేది ప్రజలే అన్న విషయాన్ని తెలుసుకోవాలని కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తపై ఎమ్మెల్యే పరోక్షంగా విమర్శలు చేశారు . వైసిపి నాయకులు స్థాయి, కేసులు గురించి మాట్లాడే ముందు తనలాగా గతంలో తనపై ఉన్న కేసులను త్వరగా విచారించి, తీర్పు ఇవ్వాలని తనలాగా సుప్రీంకోర్టును అడిగే దమ్ము ధైర్యం జగన్ కు ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లిస్తామని చెబుతున్నారని, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వారు తమకు చక్రవడ్డీ బార్ వడ్డీతో సహా చెల్లించిన తీసుకున్నా మని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ఇచ్చే కార్యక్రమాలు చేయలేద న్నారు. వైసిపి నాయకులకు బెదిరించడం, దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే తెలుసునని, తమకు మాత్రం పేదలకు సేవ చేయడం, పది తరాలు తలుచు కునేలా పాలన చేయడం మాత్రమే తమకు తెలుసన్నారు. వైసీపీ నాయ కులకు ఇతరులు ఆస్తులు కబ్జా చేయడం, సొంత చెల్లి ఆస్తులను కాజేయడం, ఆ పార్టీ నాయకుల సంస్కృతి అన్నారు. వారి పార్టీ నాయకులతో సొంత చెల్లెలు తిట్టించడం వారి సంస్కారానికి నిదర్శనం అన్నారు. జగన్ ఆయన కుటుంబ సమస్యనే పరిష్కారం చేసుకోలేదని, అలాంటిది ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ఎమ్మెల్యే కందికుంట ధ్వజమెత్తారు. జగన్ ను ఒకసారి ప్రజలు నమ్మి 151 సీట్లు ఇచ్చారని, తర్వాత ఎన్నికల్లో జగన్ పాలన చూసి కేవలం 11 సీట్లకే పరిమితం చేశారంటే జగన్ పాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంగా ఉన్నారో తెలుస్తుందన్నారు. సూపర్ సిక్స్ గురించి పదే పదే మాట్లాడే జగన్, ఆ పార్టీ నాయకులకు తాము ప్రతినెల 1వ తేదీన ఇచ్చే పెన్షన్ సమాధానమన్నారు. ఎన్నికల ముందు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు 4000, 6000, 15000 పెన్షన్ పెంచామని, జగన్ లా ఐదేళ్లు పెంచుకుంటూ పోలేదన్నారు. ఇదే వైసీపీకి, కూటమి పాలనకు ఉన్న తేడా అన్నారు. వైసిపి పాలన అంతా అబద్దాలు చెబుతూ బ్రతికారన్నారు. కాగా వైసిపి పాలనలో నేతన్నలకు అరకొరగా సాయం చేశారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి కోసం 150 కోట్లు నిధులు కేటాయించారన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 93 వేల కుటుంబాలు లబ్ధి పొందుతున్నారన్నారు. జగన్ హయాంలో కరోనా విప త్కర పరిస్థితుల్లో కూడా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నెత్తిన భారము మోపా రన్నారు. 20 నెలల కూటమి ప్రభుత్వం లో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, చార్జీలను తగ్గించిన ఘనత కూటమిపాలనదే ని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో కదిరి ఆర్డిఓ వివిఎస్ శర్మ, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్‌తో పాటు టిడిపి నాయకులు,కార్యకర్తలు,కూటమినాయకులు పాల్గొన్నారు.

# దళిత, గిరిజన కాలనీలకు వైన్‌షాపులు దూరంగా ఉండాలని వినతి



ఎక్సైజ్ సిఐకి వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

**తనకల్లు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

తనకల్లు మండలంలోని దళిత, గిరిజన కాలనీలకు మద్యంషాపులు దూరంగా వుండాలని దళిత, గిరిజన సంఘాలు నాయకులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు, మాల మహానాడు, డివిఎంసి సభ్యులు, ఎన్‌జిఒ, హెచ్‌ఆర్‌సిసిసిఐ సభ్యులు బుధవారం ఎక్సైజ్ సిఐకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా చెరుకూరి గంగులయ్య, కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తోపు పారేశు మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి సరిగాలేదని, కుటుంబ పోషణ గడవడమే చాలా దుర్భరంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో పగలంతా పనిచేసి వచ్చిన కూలి డబ్బులు కాలనీలకు దగ్గరలో వున్న మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి ఖాళీ చేతులతో ఇంటికి వెళుతున్నారన్నారు. దీంతో కుటుంబపోషణ కష్టంగా మారిందన్నారు. ముఖ్యంగా పిల్లల అవసరాలు తీర్చకపోవడం వలన చాలా కుటుంబాలు నాశనమవుతున్నాయన్నారు. అనవసరంగా ఇతరులతో గొడవపడుతూ పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్నారన్నారు. అదే మద్యంషాపు దూరంగా ఉంటే అలసిపోయి అంత దూరం వెళ్లలేక ఇంటిలో వుంటారని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏ గ్రామంలోను బెల్ట్ షాపులు ఉండకూడదని ప్రతిపాదించారని అయినా ప్రతి గ్రామంలోనూ బెల్ట్ షాపులు ఉన్నాయని వాటిని తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి డివిజన్ డివిఎంసి మెంబర్ బసెట్టి రవీంద్ర, జిపిఎస్ అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్, హెచ్‌ఆర్‌సిసిఐ కదిరి డివిజన్ సెక్రెటరీ డి.కొండయ్య జిల్లా సెక్రెటరీ కోటకొండ కృష్ణప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు గింజల శివన్న, లక్ష్మినారాయణ, చంద్ర, గింజల నరసింహులు, ఈతోడు లక్ష్మినారాయణ, దిలీప్, నరేంద్ర, రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ వృద్ధులకు అండ

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఉద్యోగుల కంటే ముందుగా వృద్ధులకు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించి అండగా నిలచి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోందని జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎంపిడీఓ శివరాంప్రసాద్‌రెడ్డి, పంచాయితీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శంకర్, విఆర్ఓ శ్రీలతలతో కలసి ఎన్టీఆర్ పింఛన్ లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వం ప్రతి నెలా అందించే పింఛన్‌తో కుటుంబ బాధ్యతల్లో తాము సైతం పాలుపంచుకుంటున్నామన్న ఆత్మసంతృప్తి మాలో కలుగుతోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నామని ఈ సందర్భంగా వారు పేర్కొనా న్నరు. మండల వ్యాప్తంగా గ్రామాలల్లో కూటమి పార్టీ నాయకులు పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైక్టర్ మండోజి ఆరీఫ్ ఖాన్, ఎస్సీ సెల్ అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్ చేనేతలకు మరింత చేయూతనిస్తుంది

చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించి చేనేతలకు ఉచిత విద్యుత్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సునీత.



చేనేత కార్మికులతో ఎమ్మెల్యే పరిటాల సునీత.

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 01 ప్రభాతవార్త**

చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అన్నది వారికి ఒక వరం కానుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్, పథకం ప్రారంభోత్సవం బుధవారం రోజు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్య క్రమాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. సిండికేట్ నగర్ కు చెందిన చేనేతలు, మండల టిడిపి నాయకులు, హ్యాండ్ లూమ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్ కు సంబంధించిన పత్రాలను అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధిక మంది చేనేత వృత్తిపై ఆధారపడ్డారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. వారిని ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలుతీసుకుంటుందన్నారు. ఇప్పటికే చేనేతలు నేసిన వస్త్రాలను మార్కెటింగ్ చేసేందుకు అనేక చోట్ల ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. అసెంబ్లీలో సైతం చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించడం, మహిళా ఎమ్మెల్యేలు చేనేత వస్త్రాలు ధరించడం వంటి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని కూడా నేడు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా కోసం ఉచిత విద్యుత్ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చేనేత కుటుంబాలకు నెలకు హ్యాండ్లూమ్ యూనిట్లకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వల్ల వారి మీద ఉన్న ఆర్థిక భారం గణనీయంగాతగ్గనుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 93వేల మంది చేనేత కార్మిక కుటుంబాలు మరియు సుమారు 11వేల 5వందల పవర్లూమ్ యూనిట్ల లబ్ధిదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.150 కోట్ల బడ్జెట్ కేటాయించడం నేతన్నల సంక్షేమం కోసం పాటుపడుతున్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఈ పథకం ద్వారా నేతన్నల జీవనోపాధి బలోపేతం కావడంతో పాటు, గ్రామీణ ఉపాధి మరియు వస్త్రరంగ అభివృద్ధికి కొత్త ఊపిరి లభించనుందన్నారు. చేనేతలకు ఈ పథకం తో పాటు మరిన్ని ప్రోత్సహకాలు భవిష్యత్తులో ఉంటాయని ఎమ్మెల్యే సునీత తెలిపారు. ఈ కార్యక్రమం లో చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రాచానపల్లి సర్పంచ్, వైస్ సర్పంచులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే.



సర్పంచ్, ఉప సర్పంచ్ నీ సన్మానించిన దృశ్యం.

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:**

అనంతపురం రూరల్ మండలం రా చానపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ ను, ఉప సర్పంచ్ మన్నల వరలక్ష్మి సుబ్రహ్మణ్యం ను మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పూలమాలలు వేసి, శాలువా కప్పి, మెమోరాండం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2తో గ్రామ సర్పంచు, ఉప సర్పంచ్ పదవికాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచ్ ఉపసర్పంచులను వైఎస్ఆర్సిపి తరపున ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, ఎంపీపీ, వై స్ ఎంపీపీ, మండల కన్వీనర్లు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో పెద్దమ్మ తల్లి విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ట

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 01 ప్రభాతవార్త**



గ్రామంలో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గుడి కమిటీ సభ్యులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభోగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట తో పాటు, బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం గ్రామం మొత్తం కలిసి బుధవారం మహోత్సవ కార్యక్రమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో వేద పండితులు పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రాణ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించి సర్పంచిని, గ్రామ పెద్దలను, గుడి కమిటీ సభ్యులను, గ్రామ ప్రజలందరినీ ఆశీర్వదించారు. ప్రాణ ప్రతిష్ట అనంతరం గ్రామంలోని ప్రజలందరూ పెద్దమ్మ తల్లికి పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించి అమ్మవారి ఆశీస్సులు అందుకుని గ్రామాన్ని చల్లగా చూడమ్మా అని ప్రార్థించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట తో పాటు బొడ్రాయి ఏర్పాటు కార్య క్రమం సందర్భంగా గ్రామ ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# బొడ్రాయి ప్రతిష్ట వేడుకలలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి.

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 01 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పెద్దమ్మ తల్లీ విగ్రహ ఏర్పాటు అదే విదంగా బొడ్రాయి ఏర్పాటు కార్యక్రమం గ్రామ పెద్దలు, ప్రజలు నిర్వహించడగా ఈ కార్యక్రమానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరు కావడంతో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పెద్దమ్మ తల్లీని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు అందుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

06ATP27_06ATP27.qxd 01-04-2026 PM 10:41 Page 1



## దేవాలయ నిర్మాణానికి 50వేలు విరాళం అందించిన హెచ్ కె ఆర్

అమరాపురం ఏప్రిల్ 1 ప్రభాతవార్త


దేవాలయ నిర్మాణానికి విరాళామందిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని హలుకూరు గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు ఆగలి మండల కుర్సంగనపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న దేవస్థాన నిర్మాణానికి విరాళంగా 50వేల రూపాయలు ఇచ్చి తన ఉదారతనుచాటుకొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు మాట్లాడుతూ మీ కుటుంబానికి ఆ దేవుని కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆశీస్సులు అందించారు. నీలాంటి మంచి మనసున్న మహారాజు మా నియోజకవర్గంలో ఉండడం మా పుణ్యం అన్నారు. ప్రాంతం, పార్టీ,కులం,మతం, చూడకుండా చేయూతనందిస్తూన్న మీకు రుణపడివున్నామన్నారు.వినాయక ఉత్సవాలకు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు యువతకు క్రికెట్ టోర్నమెంట్లో,దేవస్థానం నిర్మాణానికి,విద్యాభ్యాసం కోసం దాదాపు 18 సంవత్సరాల నుంచి సేవ చేసుకుంటూ వచ్చిన మీకు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక వైకాపా నాయకులు రామ్మూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హరిహర సుతుని జయంతి

బుక్కపట్నం, ఏప్రిల్ 01, ప్రభాతవార్త


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

మండల కేంద్రమైన బుక్కపట్నం లోని తేరు కూడలి నందు హరిహర సుతుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోట వీధిలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి భక్తులు అయ్యప్ప స్వామి జయంతిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి పూలమాలలు సమర్పించి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు మాట్లాడుతూ బుక్కపట్నంలోని కోటవీధిలో త్వరలోనే అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలియజేశారు. గ్రామంలోనే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున విరాళాలు సమర్పించడం జరిగిందన్నారు. నూతన దేవాలయ నిర్మాణం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు మృతికి నివాళి

వజ్రకరూరు ఏప్రిల్ 1 ప్రభాతవార్త


మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు (సిపిఐ) పార్టీ నాయకుడు కామ్రేడ్ తిమ్మప్ప(78) మృతికి నియోజకవర్గ నాయకులు బుధవారం నివాళులర్పించారు. సిపిఐ పార్టీలో గత కొన్ని సంవత్సరాలుగా ఎ ా ీ ట సభ్యునిగా,నాయకునిగా ఎన్నో ఉద్యమాలు చేసి బడుగు బలహీన వర్గాల తరఫున అలుపెరుగని పోరాటం చేసిన కామ్రేడ్ తిమ్మప్ప అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. గతంలో నియోజకవర్గంలోని అగ్ర నాయకులు రాకెట్ల నారాయణ రెడ్డి, ప్యాపిలి కోటిరెడ్డి, చాయాపురం రంగన్న, మహిపతి ఓబయ్య, ఎస్ శివన్న, పెంచలపాడు తిప్పారెడ్డి, చాబాల వశికేరప్ప లాంటి నాయకులతో కలిసి ఎన్నోఉద్యమాలను చేశారు.అటువంటి నాయకుడిని కోల్పోవడం కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటు అని నాయకులుఅన్నారు. అయన కుటుంబా నికి ఏసమస్య వచ్చినా భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ )అండగా ఉంటుంద ని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వజ్రకరూరు మండలం మండల కార్యదర్శి హసన్ భాష సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, నియోజకవర్గ రైతు సంఘ నాయకులు సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సుల్తాన్, నాయకులు భాస్కర రంగస్వామి తదితరులు ఉన్నారు.

## ఎంఎల్ఎస్ పాయింట్లలో హమాలీలకు ఎఫ్ఆర్ఎస్ తీయడం అన్యాయం

సివిల్ సప్లై గోడౌన్ ముందు హమాలీలు నిరసన

పెనుకొండ ఏప్రిల్1 ప్రభాతవార్త


సివిల్ సప్లై గోడౌన్ వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

ఏపీ సివిల్ సప్లై హమాలీ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పెనుకొండ సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీలు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సిఐటియు మండల కన్వీనర్ బాబావలిమాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్లలో హమాలీలకు ఎఫ్ఆర్ఎస్ తీయడం అన్యాయమని, హమాలీలకు నెల మొత్తం పని దినాలు ఉండవని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26,000 ఇచ్చి అప్పుడు ఎఫ్ఆర్ఎస్ అమలు చేసిన కార్మికులకు ఎటువంటి నష్టం కలగదని వేతనం అలా ఇవ్వకుండా ఎఫ్ ఆర్ ఎస్ అమలు చేస్తే కార్మికులకు నష్టం కలుగుతుందని తెలిపారు.హమాలీలకు బిల్లులు పాత పద్ధతిలోనే అమలు చేయాలని, ఒప్పందం గడువు ముగిసినందున కూలి రేట్లు పెంచాలని, కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీలు సుధాకర్, హనుమంతు, వలి, హనుమంతు, బాబు, నరసింహ, ఓబులేసు, శ్రీకాంత్, హనుమంతు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బత్తలపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త


మృతి చెందిన చిన్న కొండప్ప

మండలంలోని సంజీవపురం సమీపంలోని శ్రీకాటికోటేశ్వరక్షేత్రంకు వెళ్లేదారిలో ఏర్పాటు చేసిన ఆర్చ్ ను ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మవరం పట్టణం సంతమార్కెట్ దగ్గరలోని గాండ్లవీధికి చెందిన బలిజ చింతా చిన్న కొండప్ప (36) పట్టణంలోని పట్టుచీర సిల్కో గుమస్తాగా పని చేస్తున్నట్లు తెలిపారు. పని నిమిత్తం అనంతపురంకు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి ధర్మవరంకు వస్తుండగా బత్తలపల్లి మండలం సంజీవపురం సమీపంలోని శ్రీకాటికోటేశ్వరక్షేత్రంకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన ఆర్చ్ ను అదుపుతప్పి ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో చిన్న కొండన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సఫర్యలు చేసే సమయానికి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు. చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య గీతాంజలి ఉన్నారు.

## గుంతకల్ డివిజన్ చరిత్రలోనే అత్యధిక ఆదాయం..

డివిజన్ ఆర్థిక సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి.. చంద్రశేఖర్ గుప్తా


రైల్వేలో సాధించిన విజయాలకు కేక్ కట్ చేస్తున్న రైల్వే డివిజన్ మేనేజర్ గుప్తా

గుంతకల్ రైల్వే, ఏప్రిల్ 01 ప్రభాతవార్త

డివిజన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వేలో గుంతకల్. డివిజన్ ఆర్థిక సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రైల్వే ప్రయాణికులు మరియు సరుకు రవాణా విభాగాలలో సాధించిన పలు విజయాలను జరుపుకుంది. డివిజనల్ రైల్వే డివిజన్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సంవత్సరంలో, డివిజన్ తన చరిత్రలోనే అత్యధికంగా 15.73 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ సాధించి, 1134 కోట్ల ఆదాయం సంపాదించింది గత సంవత్సరంతో పోలిస్తే 13.5 కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. ప్రయాణికుల ఆదాయంలో కూడా గణనీయమైన వృద్ధి నమోదై, 1101.4 కోట్లకు చేరుకుంది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే 10.32 పెరుగుదలను సూచిస్తుంది. ఆపరేషనల్ సామర్థం కూడా గణనీయంగా మెరుగుపడి, సమయపాలన 94కు చేరుకుంది, ఇందులో 13 సందర్భాల్లో 100 సమయపాలన సాధించబడింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతూ, 221 కి.మీ ట్రాక్ ఆటోమేటిక్ సిగ్నలింగ్ కిందకి తీసుకురాబడింది మరియు మూడు బ్లాక్ సెక్షన్లు ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నలింగ్ (ఐబీఎస్) గా మార్పు చేయబడ్డాయి. ఈ విజయాలు డివిజన్ పనితీరు, భద్రత మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో నిరంతర ప్రతిబద్ధతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో డి వో యం పూర్ణచంద్రరావు, ముస్తఫా, డీసీఎం మోహన్ కృష్ణ , దేవర బాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ నెల నుంచి తరగతులు పని వేళలు పునరుద్ధరించండి

కొత్తచెరువు ఏప్రిల్ 1 ప్రభాతవార్త


తరగతుల పనివేళలు పునరుద్ధరించాలని డిఐఈఓకి వినతిస్తున్న లెక్చరర్స్, ప్రిన్సిపాల్ దృశ్యం

వచ్చే విద్యా సంవత్సరం 2026 జూన్ నుంచి మొదలయ్యే తరగతుల పని వేళలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనివేళలో పునరుద్ధరించాలని శ్రీ సత్యసాయిజిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలెక్చరర్లు,ప్రిన్సిపాల్స్ కలిసి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి (డీఐఈవో) చెన్నకేశవ ప్రసాద్ ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. గతసంవత్సరం నుండి కళాశాల యొక్క సమయం ఉదయం 9:00 గంటలనుండి సాయంత్రం 5:00 గంటల వరకు పని వేళలు పెట్టడం వలన విద్యార్థులు మరియు సిబ్బందికి అనేక ఇబ్బందులను కలిగిస్తున్నాయని వారు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు రవాణా సౌకర్యాల లేమి కారణంగా సాయంత్రం ఆలస్యంగా ఇంటికి చేరుకోవాల్సి రావడం వల్ల భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు.అదేవిధంగా, సాయంత్రం 4:00 నుండి 5:00 గంటల మధ్య విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉండటం వల్ల ఆ అదనపు సమయం ప్రయోజనకరంగా లేదని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది కూడా ఈ సమయ మార్పుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు.

## జోరుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

రొళ్ల ఏప్రిల్1(ప్రభాత వార్త):


పెన్షన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది స్థానిక టిడిపి నేతలు

రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, స్థానిక శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచనల తో రొళ్ల మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జోరుగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయితీలో స్థానిక ముఖ్య నాయకులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఇంటి వద్దకే పెన్షన్ అందజేశారు.ఈ మేరకు వారు లబ్ధిదారులతోమాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం గా పెన్షన్లను నేరుగా లబ్ధిదారుల ఇంటికే అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా నగదు అందజేశారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీసిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, స్థానిక సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప,మండల కన్వీనర్ ఈరన్న, ఏపీ ఏఐసీ డైరెక్టర్ రామకృష్ణ, భరత్, మీ సేవ వెంకటేష్, తదితర ఆయా పంచాయతీలో ముఖ్య నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ చేశారు.

## కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

రామగిరి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన కురుబ కొండన్న గొర్రెల కాపరికి చెందిన 12 గొర్రెలను వీధి కుక్కలు దాడి చేసి చంపేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గొర్రెల కాపరి గొర్రెలను మందలోకి తోలి ఇంటికి భోనానికి వచ్చాడు. ఆ తరువాత కొద్ది సేపటికి అక్కడికి వెళ్లి చూడగా 12 గొ ర్రెలు మృతి చెంది ఉన్నాయి. వీటిని కుక్కలు దాడి చేసి చంపేశాయి. దీంతో కొన్ని గాయపడిన వాటికి చికిత్సలు చేయించడానికి పశువైద్యాధికారికి సమాచారం అందించాడు. సంఘటన తెలియగానే టిడిపి నాయకులు సింగిల్ విండో ప్రెసిడెంట్ ముత్యాలు, మండల మాజీ ఉపాధ్యక్షులు ఆదినారాయణ, చలపతి, నాగన్న, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు వెళ్లి గొర్రెల కాపరిని పరామర్శించి జరిగిన నష్టం గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ధైర్యం చెప్పారు.

## ఉరవకొండలో ఘనంగా అక్క మహాదేవి జయంతి

-హాజరైన ఉత్తరాధికారి జగద్గురు డా॥కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డా॥కరిబసవరాజేంద్రస్వామి

పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో బుధవారం వీరశైవ సంక్షేమ సమాజం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో అక్క మహాదేవి జయంతిని ఘనంగా నిర్వహించగా గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డా॥కరిబసవరాజేంద్రస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్క మహాదేవి 12వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ వీరశైవ భక్త కవయిత్రని అమె కర్నాటకలోని ఉదుతాడి ప్రాంతంలో జన్మించారన్నారు. చిన్నప్పటి నుంచే భక్తి మార్గంలో అసక్తిచూపి చన్నమల్లికార్జున అనే శివుని రూపాన్ని తన ఆరాధ్యదైవంగా భావించారన్నారు. సామాజిక నియమాలకు విరుద్ధంగా అమె ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. ఆమె జీవితంమొత్తంభక్తి, వైరాగ్యం, ఆత్మ సాక్షాత్కారానికి అంకితం చేశారన్నారు. మనం అహంకారం వదిలినపుడు మాత్రమే నిజమైన ఆత్మజ్ఞానం వస్తుందని, భగవంతుడు మనలోనే ఉన్నాడని ఆమె చెప్పిన సందేశాన్ని అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం నియోజకవర్గ ప్రధాన కార్యదరి పాటిల్ నిరంజన్‌గౌడ్, నాయకులు పాల్తూరు శంకర్, చంద్రమౌళి, తిప్పేస్వామి, సురేష్, రాజశేఖర్, మల్లికార్జున, మఠం వీరేష్, మఠం యోగీశ్వర్, శ్రీధర్, ఉమేష్, శంకరయ్య, కైలాస్, సుధాకర్‌రెడ్డి, వీరన్నగౌడ్, విజయ్‌కుమార్, వికాస్‌గౌడ్, మహిళా నాయకులు సుజాత, సుశీల, మఠం నందిని, పరిమళ, మమత, జ్యోతి, లత, అంబిక, శైలా, నిర్మల, మంజుల, చాముండి, శోభ, సరోజా, ఐమా, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన భక్తులతో ఉత్తరాధికారి

## దివ్యాంగులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ

అగళి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త


దివ్యాంగులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ

ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీనే దివ్యాంగులకు, వృద్దులకు, ఒంటరి మహిళలకు, డయాలసిస్ పేషంట్లకు పెన్షన్ అందజేస్తోంది. అందులో భాగంగామధూడిగ్రామంలో దివ్యాంగులకు ఉదయాన్నే ఎంపిడిఓ గంగాధర్, కార్యదర్శి మహేష్‌లు కలిసి పెన్షన్ పంపిణీచేశారు.అదేవిధంగా మధూడి, గొల్లహట్టి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధానకార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ తెలవారగానే పెన్షన్ పంపిణీచేశారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వల్ల వృద్దులకు, దివ్యాంగులకు డయాలసిస్ పేషంట్లకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని, ఈ పెన్షన్‌తోనే నెలరోజులపాటు ఆధారపడే విధంగా ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. అదే విధంగా ఇరిగేపల్లి గ్రామంలో సర్పంచు లింగరాజు, మంజునాథ్ తదితరులు పెన్షన్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయితీల పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్‌ను అందజేశారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్ - బైక్ సీజ్

గుత్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త


నిందితున్ని అరెస్ట్ చేసిన దృశ్యం

భార్య ప్రవర్తన పట్ల అనుమానం పెంచుకొని అమానుషంగా ఆమెను హత్య చేసిన సంఘటన లో నిందితుడు మృతురాలి భర్త శివలింగయ్యను బుధవారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ రామారావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంతకల్లు మండలం మైనాపురం గ్రామానికి చెందిన శివలింగయ్యకు, తన భార్య అయిన లక్ష్మీ పట్ల గత కొంతకాలంగా అనుమానం పెంచుకొని గొడవపడేవాడని తెలిపారు. ఈ నేపథ్యంలో పామిడి మండలం కదిరిపల్లి గ్రామం నుండి మోటార్‌సైకిల్‌పై తన భార్య లక్ష్మీని ఎక్కించుకొని బళ్లారి వరకు వెళదామని పిలుచుకు వెళ్లాడు. అయితే దేవరకు పోకుండా మార్గమధ్యంలో పూలకుంట గ్రామం వద్ద ఎస్ఆర్‌కే కంకర ఫ్యాక్టరీ వద్ద తన భార్యతో గొడవ పెట్టుకుని తదుపరి ఆమెను రాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశాడని సిఐ వివరించారు. నిందితున్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వివరించారు. నిందితున్ని కోర్టుకు హాజరుపరిచామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

గుంతకల్లు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని తలపెట్టిన భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని రాజకీయ, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు బైక్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వతేదీ మంగళవారం సాయంత్రం హనుమాన్ సర్కిల్ నుండి ర్యాలీ ప్రారంభమై పట్టణ ప్రధాన కూడళ్ల మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంటుందన్నారు. కుల, మత రాజకీయాలకతీతంగా యువత, అంబేద్కర్ వాదులు, ప్రజా కుల సంఘాలు వారు వేలాదిగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. పోస్టర్లు విడుదల చేసిన వారిలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, నిర్వాహకులు మొండ్ల కేశవ, ప్రజా సంఘాల నాయకులు జగ్గలి రమేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు చికెన్ జగన్, వైసీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నల్లప్ప, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు నరసింహులు, వీరేష్, రవికుమార్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

..ఇన్ఫిన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసిన సునీత


నూతన రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి ఏప్రిల్ 1 ప్రభాతవార్త

మండల పరిధిలోని తగరకుంట పాతపాల్యం గ్రామాల్లో బుధవారం ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పంపిణీ చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్తూ ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతినెల పింఛన్లు క్రమంతప్పకుండా అందుతున్నాయా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాతపాళ్యంలో 45లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు తగరకుంటగ్రామంలో 85లక్షలతోనిర్మించిన రెండు బి.టి రోడ్లు, 65లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. అలాగే ఇన్ఫిన్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 550 మంది మహిళలకు, 50శాతం సబ్సిడీతో 550కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఇన్ఫిన్స్ సంస్థ నియోజకవర్గంలో 5వేల కుట్టు మిషన్లు పంపిణీ చేయడంతో పాటు ప్రతి మండలంలోనూ మొదటి విడతగా 50మంది ఒంటరి మహిళలకు కూడా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలనే నిర్ణయంపై ఆమెఅభినందించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ తగరకుంట లాంటి ఫ్యాక్షన్ గ్రామాల్లో గతంలో ప్రశాంత వాతావరణం ఉండేది కాదన్నారు. ఆ ఫ్యాక్షన్ వలన ఇంట్లో కుటుంబ పెద్దల్ని కోల్పోతే ఎంత బాధ ఉంటుందో నాకు ప్రత్యక్షంగా తెలుసన్నారు. అందుకే గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి ఉండకూడదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో చెరువులకు నీరందించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 90కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో సుమారు 48 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఒక్క కనగానపల్లి మండలంలోనే సుమారు 18కోట్ల నిధులతో రోడ్లు వేసామని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గుండ్లమడుగు వెంకట ప్రసాద్, ఎంపీడీవో ఎస్. అనిల్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, తగరకుంట సర్పంచ్ మాధవ రాజు, పాత పాల్యం సర్పంచ్ పూజారి రేవతి రాజా కృష్ణ, అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగల్ విండో మాజీ డైరెక్టర్ కురుబ బుసప్పను పరామర్శించిన మంత్రి సవిత


మాజీ సింగల్ విండో డైరెక్టర్ బుసప్పను పరామర్శిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ ఏప్రిల్ 1 ప్రభాతవార్త

పెనుకొండ మండలం ఇస్లాపురం మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కురుభవాండ్లపల్లి బుసప్ప అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకొంటు ఉండగా మంత్రి సవిత ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యపరిస్తితి గురించి తెలుసుకొని పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య , సింగల్ విండో చైర్ పర్సన్ పోతిరెడ్డి, మండల టిడిపి కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, టిడిపి నాయకులు సోమశేఖర్ నాయుడు, రామాంజనేయులు,చిన్న పోతన్న, సూర్యనారాయణ, రామకృష్ణ,కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేతలకు ప్రభుత్వం చేయూత


పాలాభిషేకం చేసిన సోమందేపల్లి చేనేత కార్మికులు ,కూటమి నాయకులు

సోమందేపల్లి ఏప్రిల్ 1 ప్రభాతవార్త

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ప్రభుత్వం చేనేతలకు చేయూత అందించిందని నాయకులు పేర్కొన్నారు బుధవారం మండల చేనేత కార్మికులు కూటమి నాయకులు ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారాచంద్ర బాబు నాయుడు కి,ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కి,చేనేత జౌళి శాఖా మంత్రి వర్యులు శ్రీమతి సవితమ్మ చిత్రపాటలకు పాలాభిషేకం చేసినారు.ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అని,మగ్గాలు ఉన్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని అని ప్రభుత్వం తెలపడం ద్వారా మా చేనేత కార్మికులపై విద్యుత్ బిల్లులు భారం తగ్గుతుందని.ఉచిత విద్యుత్ చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఇవ్వడం చాలా సంతోషం గా ఉన్నది అని తమ ఆనందం వ్యక్తం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో టీడీపీ హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నీరుగంటి చంద్ర,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డి వి ఆంజనేయులు,టీడీపీ మండల కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్,పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి,జనసేన మండల కన్వీనర్ జెబిఉల్ల,టీడీపీ మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప,మాజీ ఎంపీటీసీ కిష్టప్ప,మద్దిలేటి,పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల రమణ చేనేత కార్మికులు మహేంద్ర ,జక్క చంద్ర,జనసేన నాయకులు రంగేపల్లి నాగరాజు,పెయింటర్ రామాంజినేయులు,సుమిత్ర గంగాధర రాయల్, ఐ టీడీపీ నాగరాజు యాదవ్,టీడీపీ బూత్ కన్వీనర్లు డి. ఆర్ సోమశేఖర్,ప్రకాష్,డీలర్లు రమేష్,బాలు,లక్ష్మీ నారాయణ,మురళి తదితరులు పాల్గొన్నారు.

## పశుపోషకులు దాణా కోసం దరఖాస్తు చేసుకోండి

కంబదూరు ,ఏప్రిల్ 1 , ప్రభాతవార్త

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా అందజేస్తున్నట్లు కంబదూరు పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకట రమన్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, 50 కేజీల దాణా బస్తా ధరను ప్రభుత్వం రూ.1100గా నిర్ణయించగా, పాడి రైతులు మరియు పశుపోషకులకు 50 శాతం సబ్సిడీతో రూ.550కే అందిస్తున్నట్లు చెప్పారు. మండలానికి మొత్తం 25 టన్నుల దాణాను ప్రభుత్వం కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన పాడి రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా దాణా పంపిణీ చేస్తామని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నిమిషాల వ్యవధిలో టిబి నిర్ధారణ

బుక్కపట్నం, ఏప్రిల్ 01, ప్రభాతవార్త



టి బి పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

క్షయ వ్యాధి నిర్ధారణ ప్రస్తుత అత్యాధుని యంత్రాల ద్వారా సులభతరం అయిందని, నిమిషాల వ్యవధిలో వ్యాధిని నిర్ధారించి చికిత్స ప్రారంభించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.ప్రభాకర్, డా.సురేష్ లు పేర్కొన్నారు. బుధవారం ప్రధానమంత్రి టీబి ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో బుక్కపట్నం 1 ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో ఏఐ సాంకేతికతతో గుర్తించేందుకు చేతిలో ఇమిడే, (హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే ) యంత్రం అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటి ద్వారా రెండు నిమిషాలలో ఎక్రే తీసి వ్యాధి నిర్ధారణ చేసేందుకు అవకాశాలున్నాయన్నారు. ఈ అత్యాధునిక యంత్రము ద్వారా పలువురికి టిబి పరీక్షలు నిర్వహించారు. . ఇలాంటి అత్యాధునిక యంత్రం బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందజేయడం ఎంతో శుభ పరిణామమనీ వైద్యులు ఆనంద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్వైజర్లు అబిద్ భాష, ఎరికిలప్ప, సిహెచ్ఓ మానస, ఏఎన్ఎం ఓబులమ్మ, టిపిహెచ్పి రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు జబీనా జయలక్ష్మి, లక్ష్మీదేవి, మెహతాజ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## నేడు నీటి ఎద్దడిపై సమావేశం

బత్తలపల్లి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త

మండలంలోని స్వర్ణ గ్రామాలలో మంచినీటి సమస్యలపై చర్చించేందుకు గురువారం ఉదయం 11 గంటలకుఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నరసింహానాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతోమాట్లాడుతూ ఆర్ప్యాస్ ఏఈజ్యోతి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మండలంలో వేసవికాలంలో ఎదురవుతున్న మంచినీటి సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులుతో పాటు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్స్ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించిన డాక్టర్

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 01 ప్రభాతవార్త



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని నాగిరెడ్డివల్లి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో భీమన్నగారి తోట సమీపంలో ఉపాధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలతో వైద్యాధికారి రాజేష్ కుమార్ బుధవారం ఉదయం మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పనికి ఆహార పథకం కింద వచ్చిన కూలీలందరికీ వడదెబ్బకు గురికాకుండా పలు సూచనలు ఇచ్చారు. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు వీలైనంతవరకు ఉదయాన్నే పనికి వచ్చి వీలైనంత ఎక్కువ సేపు ఎండలో ఉండకుండా పని చేయాలని శరీరానికి తగినన్ని నీరు త్రాగడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే అవకాశాలు ఉంటాయని వదులైన కాటన్ బట్టలు ధరించడం ద్వారా శరీరానికి గాలి తగిలి చల్లబడటానికి సహాయపడతాయని చెప్పారు. తాజా కూరగాయలు పండ్లు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు బయట తిరగకూడదు. అలాగే సబ్జాగింజలు కూడా ఎండవేడిని తట్టుకోడానికి బాగా ఉపయోగపడతాయి. వీటిని నీటిలో నానబెట్టి తేనె, నిమ్మరసం కలిపి తీసుకుంటే శరీరానికి చలువ చేయడమే కాకుండా బాడీ డీహైడ్రేషన్‌కి గురికాకుండా ఉంటుంది. అలాగే ఎక్కడ పడితే అక్కడ నీటిని తాగకుండా శుభ్రమైన నీరునే సేవించాలి. వాంతులు విరేచనాలు అయితే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలి. కొన్ని కొన్ని సార్లు ఈ వడదెబ్బ బారిన పడినవారు ప్రాణాలు కూడా కోల్పోవచ్చు కాబట్టి వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాలని సూచించారు. అనంతరం వారందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జాన్సన్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రిస్వామి ఆశా వర్కర్ మహంతమ్మ పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

అమరాపురం ఏప్రిల్ 2 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలో నీలకంఠాపురం ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలోనేడు గురువారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు కంటి పరీక్ష పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతుందన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్ కూడా ఉచితంగా నిర్వహించబడుతుందన్నారు. అమరాపురం నుండి హాస్పిటల్‌కు ఉచిత బస్ సౌకర్యం ఉంటుందని ఆపరేషన్ చేసిన తర్వాత నల్ల కళ్లజోడు, కంటి డ్రాప్స్ కూడా ఉచితంగా ఇవ్వబడతాయి. కావున ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కంటి పరీక్ష చేయించుకోగలరని తెలిపారు.

## డైట్ నాలుగవ సెమిస్టర్ పరీక్షల రుసుము చెల్లించండి

కొత్తచెరువు ఏప్రిల్ 1 ప్రభాతవార్త

జిల్లాలో డి ఎల్ ఈడి (డైట్) నాలుగవ సెమిస్టర్ పరీక్షల రుసుము ను ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ నాలుగో తేదీ లోపు చెల్లించాలని డీఈవో జీ కృష్ణప్ప తెలిపారు దరఖాస్తులను ఆఫ్ లైన్ లో అప్లోడ్ చేయడానికి వెబ్ లింక్ అందుబాటులో ఉంది అలాగే 50 రూపాయల అపరాధ రుసుముతో ఏప్రిల్ ఐదు నుంచి ఏప్రిల్ 9వ తేదీ లోపు చెల్లించాలి కళాశాల ప్రిన్సిపాల్ వెబ్ అప్లికేషన్ ఫారం ను గేట్ వే ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలి నీ అభ్యర్థులకు సూచించారు.

## ఆర్డీటీ ప్రోగ్రాం అసోసియేట్ డైరెక్టర్‌ను కలిసి బంజారా జాతీయ నేత

-మంచు ఫెర్రర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్.కె.కేశవనాయక్

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



మంచు ఫెర్రర్‌ను సన్మానించి పుష్పగుచ్ఛం అందిస్తున్న బంజారా సంఘం జాతీయ నేత ఎస్.కె.కేశవనాయక్

ఆర్డీటీ ప్రోగ్రాం అసోసియేట్ డైరెక్టర్ మంచు ఫెర్రర్‌ను బంజారా సంఘం జాతీయ నేత ఎస్.కె.కేశవనాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని సంస్థ కార్యాలయంలో కలిసిన ఆయన ఆర్డీటీకు కేంద్రం ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించడం పట్ల మంచు ఫెర్రర్, విశాల ఫెర్రర్ దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.కె.కేశవనాయక్ మాట్లాడుతూ ఆర్డీకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణతో ఇదివరకటి తరహాలో సేవా కార్యక్రమాలు కొనసాగనుండటం పేదలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. ఆర్డీటీ సంస్థలకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు ఎస్.కె.సుబ్రమణ్యంనాయక్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కౌమార దశలో గర్భధారణ, కారణాలు, దుష్ప్రభావాలు పోస్టర్లు ఆవిష్కరణ

-విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించిన మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



కౌమార దశలో గర్బాధారణ-కారణాలు, దుష్ప్రభావాలు పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కౌమార దశలో గర్భధారణ, కారణాలు, దుష్ప్రభావాలు అనే పోస్టర్లను బుధవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ చదువుకోవాల్సిన వయసులో బాలికలు లక్ష్యాల వైపుకు అడుగులు వేయాలని చిన్న వయసులోనే పెద్ద బాధ్యత అయిన గర్భధారణతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కౌమార దశలో గర్భధారణ బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్రమైన ప్రమాదమన్నారు. బాల్య వివాహాల నిర్మూలణ మనందరి బాధ్యతన్నారు. ఈ విషయమై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి, ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, లత్తవరం మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ లేదా గ్రామ పంచాయతీ స్థలం లీజుకు ఇప్పించండి

-మంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించిన ఎంఆర్‌పీఎస్

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో మాదిగ కళ్యాణ మండపం నిర్మాణానికిగాను పంచాయతీ లేదా గవిమఠంకు చెందిన 30 సెంట్ల స్థలంను లీజుకు ఇప్పించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకులు విన్నవించారు. మంత్రి బుధవారం లత్తవరం గ్రామంలో పర్యటించగా అక్కడికి వెళ్లిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా 25 లక్షల రూపాయల నిధులను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంజూరు చేశారని అయితే కళ్యాణ మండపం నిర్మాణానికి సరైన స్థలం లభించక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజు, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు కౌకుంట్ల రవి, నాయకులు ఎం.రామాంజినేయులు, ఎం.పెద్దన్న, ఆర్.ఓబన్న, ఎం.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగొద్దు

-నెరమెట్లలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈవో మహమ్మద్ షఫీ

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ

ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయట తిరగకుండా నీడ పాటున ఉండటం ఎంతో సురక్షితమని రాకెట్ల పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎన్.మహమ్మద్ షఫీ సూచించారు. మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలో బుధవారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ షఫీ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి కనుక జాగ్రత్తలు పాటించడం తప్పనిసరన్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, టోపీలు ధరించి వెళ్లాలన్నారు. వేసవిలో మసాలా తిండి తగ్గించి సాధ్విక ఆహారం తీసుకోవాలని, మద్యపానం, ధూమపానం జోలికి వెళ్లరాదన్నారు. ఎవరైనా ఎక్కువ సేపు ఎండలో పనిచేయడం వలన అధిక జ్వరం, తలనొప్పి నీరసం నోరు ఆరిపోవడం, మగతగా ఉండటం లాంటి లక్షణాలు ఉంటే వడదెబ్బగా భావించి నీడ పాటున చేర్చి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి పంపాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తాగడంవల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శేఖర్, హెల్త్ అసిస్టెంట్ ఎన్.వెంకటేష్, సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీ నాగ సురేఖ, ఏఎన్ఎం షాజరున్నీసా బాను, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నముష్టూరు గ్రామంలో నీటి చలివేంద్రం ఏర్పాటు

-అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా మజ్జిగ మంపిణీ

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



నీటి చలివేంద్రం ప్రారంభించిన దృశ్యం

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో బుధవారం అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో ప్రజల సౌకర్యార్థం నీటి చలివేంద్రం ప్రారంభమైంది. అయ్యప్ప జన్మదినం సందర్భంగా తొలిరోజు ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ వివిధ పనుల కోసం ఇంటి నుంచి బయటకువచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో నీటి చలివేంద్రాన్ని ప్రారంభించామని ఇక్కడ ప్రతిరోజూ చల్లటి తాగునీటి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొట్టం జయరాములు, వడ్డే సుధాకర్, చందు, మనోహర్, వెలిగొండ వెంకటేశులు, ఇంద్రావతి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో పెన్షన్లు పంపిణీ చేసిన హజ్ కమిటీ చైర్మన్

గుత్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



పెన్షన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీషేక్ హసన్‌బాష పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లను అందజేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు రియాజ్, టిడిపి నాయకులు శ్రీకాంత్‌చౌదరి, ఈరన్న, కొనకొండ్ల సూరి, ఇలియాస్, శానిటేషన్ కార్యదర్శి గంగాభవాని, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చంద్రప్రియానగర్‌లో హజ్ యాత్రకు వెళుతున్న వారిని ఘనంగా సత్కరించారు. అల్లా దయవలన వారు యాత్రను క్షేమంగా ముగించుకొని రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రియాజ్, నజీర్, ఇస్మాయిల్, మాబు, అన్వర్, మహమ్మద్‌రఫీ, ఇలియాజ్, ఇమాములు, మౌజాన్లు పాల్గొన్నారు.

## వైభవంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల కళ్యాణోత్సవం

-భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం-వందలాదిగా హాజరైన భక్తులకు అన్నదానం

-రాత్రి నేత్రపర్వంగా కొనసాగిన బసవేశ్వర (నంది) వాహనోత్సవం

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవం జరుగుతున్న దృశ్యం



ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు



కళ్యాణోత్సవ కార్యక్రమానికి హాజరైన భక్తులు

ఉరవకొండ పట్టణంలోని పురాతర మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం చైత్ర శుద్ధ చతుర్దశి బుధవారం భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల కళ్యాణ మహోత్సవం అభిజిత్ లగ్నంలో నేత్రపర్వంగా వైభవంగా జరిగింది. ఈనెల గతనెల 31వ తేది నుండి జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా తెల్లవారుజామున స్వామివారికి రుద్రాభిషేకం, మండప పునఃపూజ, గంగపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణవేదికలో శోభాయమానంగా తీర్చిదిద్దిన భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య మేళతాళాలతో శాస్త్రోత్తంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. పట్టణంనుండే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుండి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ఆ కమణీయ ఘట్టాన్ని తిలకించి మంత్రముగ్దులయ్యారు. మధ్యాన్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి బసవేశ్వర (నంది) వాహనోత్సవం నిర్వహించారు.

### నేడు మల్లేశ్వరస్వామివారి బ్రహ్మరథోత్సవం:

బ్రహోత్సవాల్లో భాగంగా అత్యంత ప్రధానమైన బ్రహ్మరథోత్సవం కార్యక్రమం శుద్ధ పౌర్ణమి గురువారం సాయంత్రం 5.15 గంటలకు వైభవంగా జరుగనుంది. రాత్రి 7:30 గంటలకు అక్క మహాదేవి జన్మదిన పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. 3న శుక్రవారం రాత్రి లంకాదహనం, 4న శనివారం రుద్రాభిషేకం, ధ్వజారోహణం, సాయంత్రం కంకణ విసర్జన, విజయ వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

## ఉరవకొండలో సజావుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

-ఇంటికి వెళ్లి అందించిన సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



పింఛన్ పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగింది. సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇంటింటికీ వెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పింఛన్లను పంపిణీ చేశారు. భర్త చనిపోగా అతని భార్య మరుట్ల రసూల్‌బీకు మంజూరైన స్పౌజ్ పింఛన్‌ను ఆమె ఇంటికి వెళ్లి అందించిన టీడీపీ నాయకులు ప్రభుత్వం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్‌కుమార్ వెలుగు సిబ్బంది తిప్పేస్వామి, 108 బూత్ కన్వీనర్లు ఖాదర్‌బాషా, ఈడిగ వేణుగౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు పుల్లయ్య, విశ్వనాథ్, వసంత్‌కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలి

- దళిత వేదిక కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



మాట్లాడుతున్న దళిత వేదిక కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి మండలంలోని, గ్రామాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలని, బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా దళిత వేదిక కమిటీ సభ్యులు, చెన్నేకొత్తపల్లి, ఎంపీడీవోని కోరారు. ఈ సందర్భంగా యస్సీ, ఎస్టీ, బీసీలకు అలాగే పేద ప్రజలకు.. జీవనదారమైన ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మండలములోని అన్ని గ్రామ పంచాయతీలలో అర్హులైన వారికి అందరికి పని కల్పించాలని, అలాగే స్మశాన వాటికలకు ప్రహరీ గోడలు నిర్మించాలని, అర్హులైన ఎస్సీ,ఎస్టీలకు గోకులంసేడ్స్ నిర్మించాలని కూడాకోరడం జరిగినది. పుల్లేటిపల్లిగ్రామంలో నెలకొన్న తాగునీటిసమస్యను సద్విని పరిష్కరించాలని వారు ఎంపీడీవోను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉపాధి హామీ పథకం కింద మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరడం చాలు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు ఆసాది కుళ్ళాయప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు పత్తకాల మల్లికార్జున, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జారి కుళ్ళాయప్ప, జిల్లా ప్రచార కార్యదర్శి గుజ్జారి గంగాద్రీ, జిల్లా కో కన్వీనర్ సాకే ఓబులేసు,ధర్మవరం మండల టౌన్ కన్వీనర్ పతకాల ఓబులేసు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి...!

ధర్మవరం,ఏప్రిల్1,ప్రభాతవార్త



మృతి చెందిన కొండన్న (ఫోటో)

ధర్మవరం పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన కొండన్న(40)సంవత్సరాలు, ప్ర లక్ష్మీనారాయణ, అను వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో ధర్మవరం నుండి అనంతపురానికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో తాను నడుపుతున్న ద్విచక్ర వాహనం తన అంతకు తాను అదుపు చేసుకోలేక రోడ్డు పక్కనే ఉన్న కాటమయ్య దేవాలయం ఆర్చ్ స్తంభానికి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కొండన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కొండన్న ధర్మవరం పట్టణంలో సిల్క్ హౌస్ లో గుమస్తాగా పని చేస్తున్నట్టు కొండన్న భార్య గీతాంజలి తెలిపింది.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

- హాజరైన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు గావించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి కరుణాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఉండి వారు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కూలితే గాని కదలరా..?

రొళ్ల ఏప్రిల్ 1(ప్రభాతవార్త):



మారుతి కాలనీలో చీలి కూలడానికి సిద్ధంగా ఉన్న భారీ చెట్టు



రత్నగిరి రోడ్డులో ఎండి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టు

మండలంలో పలు ప్రాంతంలో ఆర్ అండ్ బి ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న మోడువారిన భారీ చెట్లు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏక్షణాన కూలుతాయో అని వాహనదారులు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి దుస్థితి నేల్కొంది.వాటిని ఆర్అండ్ బీ శాఖా ఆధికారులు తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మండల కేంద్రంలో వాహనంపై వెళుతున్న ఇద్దరిపై ఎండిన కొమ్మ పడడంతో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనను గుర్తు చేసుకొని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తిరిగి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.ఎండిన చెట్లు కూలితే గాని పట్టించుకోరా? అని మండిపడుతున్నారు. మండలంలోని మారుతి కాలనీలో అలాగే రత్నగిరి రోడ్డులోనీ పాత సినిమాథియేటర్ పక్కనే ఆర్ అండ్ బీ రహదారికీ ఆనుకుని ఉన్న మోడువారిన చెట్టు ప్రమాదకరంగా మారింది. వీటి కింద,సమీపంలో చిన్నపాటి ఇళ్లు, రేకుల షెడ్లు, ఉన్నాయి.మరోవైపు వాహనాలు, ప్రజల రాకపోకలు నిత్యం సాగిస్తున్నారు.ఈదురుగాలులకు ఇప్పటికే వాటి కొమ్ములు విరిగి కింద పడుతున్నాయి. ఆ సమయంలో చెట్టు కింద ఉండే వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో అకాల వర్షాలతో పాటు ఈదురుగాలల ప్రభావం అధికంగా ఉంటుంది. ఎండిన చెట్లు నేలకొరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్న వాదన ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ప్రమాదంగా మారిన చెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## యువతకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం

- సన్ రైజర్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న ఎంపిడిఓ లక్ష్మినారాయణ

బెళుగుప్ప, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



క్రికెట్ ఆడుతూ ఆటను ప్రారంభిస్తున్న ఎంపిడిఓ లక్ష్మినారాయణ

మండల కేంద్రమైన బెళుగుప్పలోని సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారి ఆధ్వర్యంలో బుధవారం నుంచి నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు అభినందనీయమని ఎంపీడీవో లక్ష్మినారాయణ, ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ గురుబ్రహ్మ, టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున పేర్కొన్నారు.బుధవారం మండల కేంద్రమైన బెళుగుప్ప ఎన్టీఆర్ స్టేడియంలో సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండంట్ మారెన్న, డైరెక్టర్లు నాగభూషణ, చిన్న తిప్పయ్య ఆధ్వర్యంలో ఘనంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో లక్ష్మినారాయణ, ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ గురుబ్రహ్మ, టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు మంచి విద్యతోపాటు, యువతకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా యువకులు కూడా ఈ క్రికెట్ క్రీడా పోటీలను సద్వినియం చేసుకొని, మంచి క్రీడా నైపుణ్యాన్ని పొందాలన్నారు. ముఖ్యంగా ప్రతి క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఉండాలని గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ముఖ్యంగా 1985 లో బెళుగుప్ప కు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు నీ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని, సమీపంలో ఆసుపత్రిలో రాత్రి విడది కూడా ఉన్నందున, ఈ స్థలానికి ఎన్టీఆర్ స్టేడియం గా స్థానిక యువకులకు క్రికెట్ పోటీలకు మారిందని టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున పేర్కొన్నారు. వర్షం కారణంగా పూర్తిగా పాడైన ఎన్టీఆర్ స్టేడియం క్రీడా మైదానాన్ని సన్ రైజర్స్ మోడల్ స్కూల్ యాజమాన్యం ఎంతో కష్టపడి, గ్రౌండ్ ను సిద్ధం చేశారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, డైరెక్టర్లు నాగభూషణ చిన్న తిప్పయ్య మాట్లాడుతూ యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని ఉద్దేశంతో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలకు రాయదుర్గం, కనేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ, కనేకల్,ఆత్మకూరు వివిధ ప్రాంతాల నుంచి 40 జట్లు పోటీలు పాల్గొన్నారన్నారు. ఈనెల 14వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలు విన్నర్స్ జట్టుకు 30 వేల రూపాయల నగదు తో పాటు, విన్నర్స్ ట్రోఫీ, రన్నర్స్ జట్టు కు 15 వేల నగదుతో పాటు రన్నర్స్ ట్రోఫీ, మ్యాన్ ఆఫ ద సిరీస్,మ్యాన్ ఆఫ ద మ్యాచ్ లు అందచేస్తామన్నారు.అనంతరం అధికారులు, నాయకులు ప్రారంభపు మ్యాచ్ హనకనహాల్ జట్టు, యర్రగుడి జట్లు బలపడగా టాస్ వేసి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మినారాయణ, ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ గురుబ్రహ్మ, టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున, ఈవో ఆర్డీ గోపాల్, పంచాయతీ కార్యదర్శి మంజునాథ, వీఆర్వో ఎర్రిస్వామి, ఆర్గనైజర్లు విజయ్, గుండ్లపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

